


# తెల్లవారింది

సుబ్బడు రోజూ తాగవలసిందే.

పొద్దున్నేలేచి ముఖం కడుక్కోటం ఎంత సహజమో, రాత్రికి కల్లు తాగటం అంత సహజం. కూటి మాట దేవుడెరుగు. చుక్కలు ఆకాశం మీదకొచ్చేసరికి కడుపులో చుక్క పడకపోతే ఆకాశం తిరిగి పడిపోయినట్టుంటుంది సుబ్బడికి.

ఫ్యాక్టరీలో రూపాయిన్నర కూలి చేతిలో పడగానే అందులో రూపాయిబిళ్ళ ఎగిరి గంతులేస్తూ ఉంటుంది కల్లు దుకాణం గల్లాలోకి పరుగెట్టడానికి. అంగలంగలుగా వెళ్ళిపోతాడు వూరిబయట దుకాణానికి. కల్లు దుకాణం యజమాని వీరాస్వామి గుడిసెల్లో దూరేవాడి ముఖం చూసి చెప్పేయగలడు వాడిదగ్గర మస్తుగా డబ్బుందో లేదో! డబ్బున్నవాడు కల్లుపాకలోకి దూరి కూర్చుని 'ఒరేయ్'! అనటంలో ఓ ధీమా ఉంటుంది. అంతంతమాత్రంగాడు అడుగు ఘనంగా వేయలేడు. ముంత తెమ్మని దబాయించలేడు. ఆ రోజు సుబ్బడు బహు హుందాగా గుడిసెలో దూరాడు. చెక్కబల్ల మీద కూర్చోగానే చింకితువ్వాలు ఛెళ్ళున ఝాడించాడు. అలా ఝాడించిన తువ్వాలు ఉండచుట్టి కాలుకింద పెట్టుకుని 'ఒరేయ్'! అని కేకేశాడు. ఆ కేక లక్షాధికారి పదిమంది నౌకర్లని పిలిచినట్టుంది. ఆ కేకలోని వూపు చూసి, వీరాస్వామి సైగ అందుకుని, కుర్రాడు

ముంతనిండా కల్లు తెచ్చి ముందు పెట్టాడు. సుబ్బడు ఆ ముంతని ప్రేమగా చూశాడు. మళ్ళీ మళ్ళీ చూశాడు. ఇన్ని రూపాయలు నీకిచ్చేస్తున్నానే! కడుపుకు తినటంలేదు. కట్టుకున్న పెళ్ళానికి పెట్టటం లేదు. కన్నోళ్ళకి కాని ఇయ్యటం లేదు. నీకే! నీకే! ఎన్ని రూపాయలిచ్చాను. నా కష్టమంతా నీకే దార పోత్తన్నానే నువ్వు నన్నిడిసి పెట్టవు, నేను నిన్నిడిసి పెట్టను. పట్టు! ఇది జల్మబంధం! అనుకుంటూ ముంతెత్తి గటగట తాగేశాడు.

ఓ నిముషమాగి సుబ్బడు 'ఓ . ఒరేయ్!' అన్నాడు. మళ్ళీ వీరాస్వామి కనుసైగతో కుర్రాడు ముంత నింపాడు. రెండోముంత చూస్తూ సుబ్బడు కలలుగంటం మొదలెట్టాడు. రోజుకి రూపాయిన్నర సంపాదిస్తే అర్ధరూపాయి ఇంటికెళ్తోంది.తనెప్పటికైనా డబ్బు సంపాదిస్తాడు. డబ్బెక్కణ్ణించి వస్తది? దూరపు సుట్టం ముసలమ్మెవరో సస్తది? డబ్బున్న సుట్టం ముసలమ్మ ఎవరూ లేరే..... ఉంటది ..... ఎక్కడో ఉంటది ..... ముందుగా తెలవదు..... తెలిస్తే ఇప్పుడే ఎళ్ళి సంపుదును గదా! ఆ ముసల్ది ఎంకమ్మ .... దాని దగ్గర బంగారం ఉంది ..... డబ్బుంది ..... పొలం వుంది. అది సావంగానే బోల్డంత డబ్బు ..... పెళ్ళానికి సీరలు ..... తనింట్లోనే కల్లు బానలు..... వోహ్ ..... ముంత ఖాళీ చేశాడు సుబ్బడు.

కల్లు కళ్ళల్లో కొచ్చింది.
తలకాయ తాళం వేస్తోంది.
మాట నాలికదాటి రావటం లేదు.
'వో' అన్నట్లు ఖాళీముంత వూపాడు సుబ్బడు.

ఈ తడవ వీరస్వామి సైగ చెయ్యలేదు. కుర్రాడు కల్లు పొయ్యలేదు. రూపాయిమించి సుబ్బడి దగ్గర ఉంటానికి వీల్లేదు. అంచేత చూడనట్టు వూరుకున్నాడు వీరాస్వామి. సుబ్బడికి ఆ రోజున పండగ ఈనాము కింద రెండు రోజుల కూలిచ్చారు. సుబ్బడిక ఉండబట్టలేక వీరాస్వామి దగ్గరకెళ్ళి "ఏటి నా దగ్గర డబ్బులేదనా .... ఇదో రెండ్రూపాయలు ఏటనుకుంటున్నావో .... నాకు ఆస్తొస్తది..... ముసలెంకమ్మ సస్తది ... బోల్డంత పొలం.... డబ్బు..... నాకేం లోటు లేదు ...." అంటూ వూగిపోతున్నాడు. ఎప్పుడు సస్తది ముసల్ది అన్నాడు

వీరాస్వామి.

"రేపో ..... ఎల్లుండో..... రేపే సస్తది. రేపు బాన తాగేత్తాను ...." ' అంటూ మరో రెండుముంతలు గటగట తాగేశాడు.

వీధిన తట్టుకుంటూ, రాళ్ళు తన్నుకుంటూ గుడిసెకొచ్చి పడ్డాడు. పెళ్ళాన్ని గంజి తెమ్మని అరిచాడు. ఉప్పు తక్కువన్నాడు. ఉల్లిపాయకారం లేదన్నాడు. విసుక్కున్నాడు. తిట్టుకున్నాడు. తిన్నంత తిని ఎల్లకితలా పడుకున్నాడు.

పొద్దున లేస్తే సుబ్బడికి ఏవిటోగా ఉంది. వేప్పుల్లతో పళ్ళుతోమి ఫ్యాక్టరీకి పోతూంటే ఉదయపు ఎండ కాలిపోతున్నట్టుంది. ఎద్దులు ఆవుల్లా కన్పిస్తున్నాయి. చల్లగాలి చికాగ్గా ఉంది. కాళ్ళూ, చేతులూ తనవిలాగా తోచడంలేదు. కాళ్ళు నడుస్తున్నాయిగాని నడక నిటారుగా లేదు. అలాగే వెళ్ళి పనిచేశాడు.

సాయంత్రం సుబ్బడికి కూలివ్వలేదు. పండగ ఈనాముకింద కూలి జమచేశారు. కల్లు లేదనేసరికి కడుపు చెరువయిపోయింది. అందరి దగ్గర అప్పడిగాడు. దొరకలేదు. ఏడుపొస్తోంది. చుక్కల్ని, ఆకాశాన్ని తెగతిట్టాడు. ముసలమ్మ చావలేదు. ఆస్తి రాలేదు. నరాలు పీకుతున్నాయి. గుండెల్లో దిగులు. కాళ్ళలో నిస్సత్తువ .... కళ్ళలో కోపం ...... వీరాస్వామిని బతిమిలాడాడు. అప్పు దొరకలేదు. కసిగా వీధిలోని రాళ్ళని తంతూ ఇంటికొచ్చాడు. పెళ్ళాన్ని పిల్లల్ని తిట్టాడు. గంజితాగి పండుకుంటే కలత నిద్రలో కల .... కలలో ముసలమ్మ. ముసలమ్మ దేవతైంది. రెండుచేతుల్లో రెండుపాత్రలు. ఒక పాత్రలో పచ్చ కర్పూరం వేసిన చిక్కటిపాలు, రెండోపాత్రలో కల్లు. 'ఏది కావాలో తీసుకో' మంది. కల్లు తీసుకుని కడుపారా తాగాడు ...... .... ఆతర్వాత పెద్ద బల్లెంతో రాక్షసుడు వాడితో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో రాక్షసుడు బల్లెంతో గుండెలో పొడిస్తే కెవ్వున అరిచి నిద్ర లేచాడు.

తెల్లవారింది.

అంట్లుతోముతున్న పెళ్ళాం అందంగా కనిపించింది. ఆడుకుంటున్న పిల్లలు ముద్దొచ్చారు. చల్లగాలి హాయిగా ఉంది. పువ్వులు ఎండకి మెరుస్తున్నాయి. "ఇట్టాగెప్పుడూ లేదే," అని అబ్బుర పడ్డాడు సుబ్బడు.

రాత్రి కలలో పచ్చకర్పూరం పాలు తాగకపోతినే అని బాధపడ్డాడు.*